క్లుప్తంగా

క్షీరారామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



క్షీరారామలింగేశ్వరునికి పూజలు చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం నుండి భక్తులు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు జనార్ధనస్వామి, లక్ష్మీపార్వతి అమ్మవార్లకు అర్చనలు, కుంకుమ పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్రికెట్ జట్టుకు ఎంపికైన పెనుగొండ విద్యార్థి



హరీష్

పెనుగొండ: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్రికెట్ జట్టుకు జరిగి న సెలక్షన్స్‌లో పెను గొండ విశ్వ తేజ డిగ్రీ కళాశాల బీకాం రెండో సంవత్సర విద్యార్థి కేకే సూర్య నాగ హరీష్ ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఎం నాగబాబు, ప్రిన్సిపాల్ పులిగెడ్డ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం కళాశాలలో ఎంపికై న విద్యార్థిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

వైభవంగా ఏడు లక్షల గోవిందనామ జపం



గోవింద నామ జపం చేస్తున్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్: ఉభయగోదావరి జిల్లాల గోవిందమాల కల్యాణ ఉత్సవ కమిటీ గురు గోవింద పీఠం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏడు లక్షల గోవింద నామ జపం చేశారు. బుధవారం నంబూరి భాగ్యలక్ష్మి, కొప్పినీడి కల్యాణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో గోవింద నామ జపం చేశారు. గోవిందమాల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం కోసం స్థలం సేకరణ వేగంగా జరగాలని సంకల్పంతో ఈ జపం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గోవింద జపంలో సుమారు 100 మంది మహిళలు, గోవింద స్వాములు పాల్గొన్నారు.

హైందవ శంఖారావ సభకు మద్దతుగా బైక్ ర్యాలీ



హైందవ ప్రచార బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు

పెనుమంట్ర: హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావ సభకు మద్దతుగా మండల విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం బైక్ ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మండలంలోని సోమరాజు ఇల్లిందలపర్రు నుంచి ఉదయం ప్రారంభించి జుత్తిగ, మాముదూరు, పెనుమంట్ర, వెలగలవారి పాలెం, ఆలమూరు, నెలమూరు, సచివరం, వెలగలేరు గ్రామాల మీదుగా ప్రచారం చేస్తూ మార్టేరు గ్రామానికి చేరుకుంది. ఈ ప్రచార ర్యాలీలో వివిధ పార్టీలకు చెందిన యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలు దారుణం



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మున్వర్ తదితరులు

భీమవరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీవీ అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కన్వీనర్ ఎండీ మున్వర్ అన్నారు. బుధవారం భీమవరంలో పార్టీ తాత్కాలిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మున్వర్ మాట్లాడుతూ అంబేడ్కర్ పట్ల అనుచితవ్యాఖ్యలు చేయడం కేంద్రమంత్రికి తగదని హితవు చెప్పారు. రాజ్యాంగాన్ని గౌరవించని హోం మంత్రి అమిత్‌షా ప్రజలను, చట్టాలను ఎలా గౌరవిస్తారని మున్వనర్ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఖలీల్ అహ్మద్, తాహిర్, సాధిక్, మగ్బూల్, శ్రీనివాస్, విజయ్, సుబ్బయ్య, ముక్తియార్ పాల్గొన్నారు.

పదిలమైన ఫలితాల కోసం..

- పదో తరగతి విద్యార్థులపై శ్రద్ధ
- ఉత్తమ ఉత్తీర్ణత కోసం ప్రత్యేక క్లాసులు



యలమంచిలి మండలం దొడ్డిపట్ల హైస్కూల్ లో స్పెషల్ క్లాసులో చదువుతున్న విద్యార్థులు



యలమంచిలి మండలం మేడపాడు హైస్కూల్ లో స్లిప్ టెస్ట్ రాస్తున్న పదవ తరగతి విద్యార్థులు

యలమంచిలి: పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నాయి. మార్చి 17 నుంచి 31 వరకు పరీక్షలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు విద్యాశాఖ అధికారులు డిసెంబర్ 1 నుంచి వంద రోజుల ప్రత్యేక కార్యక్రమ కార్యాచరణ ప్రారంభించారు. వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. ఈ పాటికే పూర్తి కావాల్సిన సిలబస్.. కొన్నిచోట్ల ఇంకా మిగిలే ఉంది. వంద రోజుల ప్రణాళిక సరే.. సిలబస్ పూర్తి చేసి, వంద శాతం ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కసరత్తు చేస్తున్నారు. విద్యాశాఖ అందజేసిన ప్రణాళిక మేరకు ఫలితాల కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటి దాకా దాదాపు 80 శాతానికి పైగా సిలబస్ పూర్తి కాగా నిర్దేశించిన గడువులోపు మిగిలిన సిలబస్ పూర్తి చేసి, వంద రోజుల ప్రణాళికపై మరింత దృష్టి సారించనున్నారు.

వంద రోజుల ప్రణాళిక ఇలా..

- రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఓ పాఠ్యాంశానికి సంబంధించి సబ్జెక్ట్ టీచర్ చదివించాలి. అదే అంశంపై మధ్యాహ్నం 4 నుంచి 5 గంటల వరకు పునశ్చరణ పరీక్ష పెట్టాలి.
- సబ్జెక్టు నిపుణులు తయారు చేసిన ప్రశ్నపత్రాన్ని ఆన్ లైన్ లో తీసుకొని పరీక్ష నిర్వహించాలి. వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలి.
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, భోజన విరామ సమయం తర్వాత 4 గంటల వరకు ఇద్దరు సబ్జెక్టు నిపుణుల ఆధ్వర్యంలో రోజూ ప్రత్యేక తరగతులు కొనసాగుతాయి.
- ప్రతి పాఠ్యాంశానికీ ముఖ్య ప్రశ్నలు, బిట్స్ తయారు చేసి ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులతో వాటికి సమాధానాలు రాయించాలి.
- వంద రోజుల ప్రణాళికలో రెండో శనివారం, ఆదివారం కూడా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. కేవలం పండగ సెలవులు మినహా మిగతా అన్ని రోజులు తరగతులు సాగాలి.
- సంక్రాంతి సెలవుల్లోనూ ఇంటి వద్దే చదువుకునేలా విద్యార్థుల సందేహాలను మొబైల్ ద్వారా ఉపాధ్యాయులు నివృత్తి చేసేలా ప్రణాళిక రూపొందించారు.

మంచి ఫలితాలు సాధించేందుకు కృషి

పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు పోతున్నాం. ఇప్పటికే రోజుకో ఉపాధ్యాయుడిని టైం టేబుల్ ప్రకారం నియమించి స్టడీ అవర్స్ ఏర్పాటు చేస్తున్నాం. స్లిప్ టెస్టులు నిర్వహించి, వంద శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం.

– కనుమూరు రామకృష్ణంరాజు, ఎంఈఓ –2, యలమంచిలి

ప్రణాళికతో శిక్షణ



విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రణాళికతో స్టడీ అవర్స్, సబ్జెక్టుల వారీగా పరీక్షలకు చర్యలు తీసుకుంటున్నాం. అదనపు తరగతులతో విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేస్తున్నాం. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులు మంచి మార్కులు సాధించాలనే లక్ష్యంతో శిక్షణ ఇస్తున్నాం. వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– పంతం రామ్మూర్తినాయుడు, మాథ్స్ టీచర్, జెడ్పీ హైస్కూల్ మేడపాడు

590 మార్కుల లక్ష్యాన్ని సాధిస్తాను



ఉదయం, సాయంత్రం నిర్వహించే స్టడీ అవర్స్ ఉపయోగపడుతున్నాయి. మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో 590 మార్కులకు పైగానే సాధించాలనే లక్ష్యం పెట్టుకున్నాను. ఉపాధ్యా యుల ప్రోత్సాహం బాగుంది. వారు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. వారి సలహాలతో లక్ష్యాన్ని సాధిస్తాననే నమ్మకం ఉంది.

– గుబ్బల మీనాక్షి, 10వ తరగతి, మట్లపాలెం

యువత క్రీడల్లో ప్రతిభ చాటాలి



జిన్నూరులో వాలీబాల్ క్రీడాకారుడు గుబ్బల శ్రీనివాస్ (చోటు)ను సత్కరిస్తున్న స్థానిక నాయకులు

పోడూరు: యువత క్రీడల్లో ప్రతిభను పెంపొందించుకుని రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని డీసీసీబీ మాజీ డైరెక్టర్ దేవళ్ల ప్రసాద్ దేవళ్ల ప్రసాద్ పిలుపునిచ్చారు. జాతీయ వాలీబాల్ జట్టు(సీనియర్స్)కు ఎంపికై న సందర్భంగా జిన్నూరు గ్రామానికి చెందిన వాలీబాల్ క్రీడాకారుడు గుబ్బల శ్రీనివాస్(చోటు) ను స్థానిక నాయకులు బుధవారం సత్కరించారు. దేవళ్ల ప్రసాద్, మాజీ సర్పంచ్ పాలవలస తులసీరావు దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. శ్రీనివాస్ గత కొన్నేళ్లుగా వాలీబాల్ క్రీడాకారుడిగా సత్తా చాటుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం గ్రామానికి ఎంతో గర్వకారణమని వారు కొనియాడారు. కార్యక్రమంలో వార్డుమెంబరు గూడూరి తారకరామారావు, గ్రామపెద్దలు పితాని శ్రీనివాస్, చెల్లబోయిన వెంకట్రావు, పాటి వెంకటేశ్వరరావు, పాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు స్వర్ణం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయానికి పట్టణానికి చెందిన పి.సత్యవతి 20గ్రాముల బంగారం సమర్పించారు. అమ్మవారి సన్నిధిలో ఆలయ అధికారులకు బంగారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీర్వాదం, శేషవస్త్రం అందజేసినట్లు దేవస్థానం సహాయ కమిషనర్ బి.ఎం.నగేష్ తెలిపారు.

రంగవల్లులతో కొత్త ఏడాదికి స్వాగతం



పెనుగొండ: గొబ్బిళ్లతో ఆకర్షిస్తున్న ముగ్గు



పెనుగొండ: సిద్ధాంతంలో నూతన సంవత్సరానికి స్వాగతం చెబుతున్న ముగ్గు



పాలకొల్లు అర్బన్: రాత్రి సమయంలో ఇంటి ముందు ముగ్గు వేస్తున్న బాలిక



పాలకొల్లు పట్టణంలోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఆసుపత్రి ముందు ఆకట్టుకున్న ముగ్గు



పాలకొల్లు శివారు రామయ్యహోలు ప్రాంతంలో ఆకట్టుకున్న ముగ్గులు

కొత్త సంవత్సరానికి మహిళలు రంగవల్లులతో స్వాగతం పలికారు. మంగళవారం అర్ధరాత్రి వరకూ వీధుల్లో ముగ్గులు వేశారు. ఇళ్లముందు రకరకాల ఆకృతిలో ముగ్గులు వేసి స్వాగతం పలికారు. ముగ్గులకు రంగులు అద్దడంతో చూడముచ్చటగా నిలిచాయి. సాధారణంగా ధనుర్మాసం అంటేనే ముగ్గులకు ప్రసిద్ధి. దీనికి తగ్గట్టుగానే ముగ్గులు వేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. గ్రామాల్లో యువత అర్ధరాత్రి సమయంలో సందడి చేస్తూ వీధుల్లో తిరిగారు. పాత ఏడాదికి వీడ్కోలు పలికి కొత్త ఏడాది స్వాగతం పలికారు.

– పాలకొల్లు అర్బన్/పెనుగొండ

ఊరూవాడా నూతన సంవత్సర సందడి



ముదునూరికి శుభాకాంక్షలు చెబుతున్న నర్సింహరాజు చిత్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీవెంకటరమణ



ముదునూరికి బొకే అందించి శుభాకాంక్షలు చెబుతున్న పాలకొల్లు ఇన్‌చార్జ్ గుడాల గోపి



పెనుగొండ: మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న పెనుగొండ మండల వైఎస్సార్ సీపీ నాయకులు



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

నరసాపురం: 2025 నూతన సంవత్సరానికి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ముఖ్యంగా రాజకీయ నాయకుల ఇళ్ల వద్ద నూతన సంవత్సర సందడి నెలకొంది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజును బుధవారం సాయంత్రం పట్టణంలోని ఆయన నివాసంలో పాలకొల్లు, ఉండి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జులు గుడాల శ్రీహరిగోపాలరావు(గోపి), పీవీఎల్ నర్సింహరాజు కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. వారి వెంట ఆయా నియోజకవర్గాల ముఖ్యనేతలు ఉన్నారు. అలాగే ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ కార్యాలయంవద్ద, సబ్‌కలెక్టర్, డీఎస్పీ కార్యాలయాల వద్ద వేడుకలు జరిగాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ నివాసంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకను ఘనంగా జరిపారు.

పెనుగొండలో..

పెనుగొండ: నూతన సంవత్సర వేడుకలు బుధవారం వేడుకగా నిర్వహించారు. ఆచంట నియోజకవర్గంలో యువత నూతన సంవత్సరం వేడుకలతో హోరెత్తించారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకూ కేరింతలతో గడిపారు. నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు నివాసం తాడేపల్లిగూడెం ఆచంట నియోజక వర్గం నుంచి వైఎస్సార్ వదసీపీ పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లాయి. ఉదయం నుంచి సాయంత్ర నుంచి భారులు తీరారు. గజమాలలు, బొకేలతో వెళ్లి కేక్‌లు కట్ చేయించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పెనుగొండ మండలంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పోడూరి గోవర్ధన, ఆచంట మండలంలో దిగమర్తి సూర్యకుమారికి ఆయా మండలాల్లోని అధికారులు, నాయకులు భారీగా తరలి వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: నూతన సంవత్సర వేడుకలను వైఎస్సార్ సీపీ నాయకులు వారి వారి ఇళ్ల వద్ద బుధవారం ఘనంగా జరుపుకున్నారు. యాళ్లవానిగరువులో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలన్నారు. అలాగే వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కర్రా జయ సరిత పుట్టిన రోజు సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ అభిమానులకు పంచారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గుణ్ణం నాగబాబు, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి తదితరుల ఇళ్ల వద్ద కేక్ కట్ చేశారు.

ఎంఎంకేఎస్‌ఎం స్కూల్ గ్రౌండ్‌కు మోక్షం



ఎంఎంకేఎస్ఎం స్కూల్ గ్రౌండ్ దుస్థితి (ఫైల్)



పూర్వ విద్యార్థుల చొరవతో గ్రౌండ్ పరిస్థితి



స్కూల్ నుంచి గ్రౌండ్‌లోకి నూతనంగా ఏర్పాటుచేసిన గేటు, నేమ్ బోర్డు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని మాచేపల్లి మాణిక్యం, కంచర్ల నరసింహం మునిసిపల్ (ఎంఎంకేఎస్ ఎం) ఉన్నత పాఠశాల 125 వసంతాలు పూర్తి చేసుకోనుంది. ఈ పాఠశాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు నేడు పనులు ద్వారా పాఠశాలను ఎంతో అభివృద్ధి చేశారు. ముఖ్యంగా తరగతి గదులతో పాటు విద్యార్థుల సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేశారు. అయితే తర్వాత దశ పనుల్లో స్కూల్ గ్రౌండ్ మెరుగుపరుస్తారని చాలా మంది భావించారు. కానీ గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారానికి దూరం కావడంతో తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం పాఠశాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పూర్వం విద్యార్థులు ఆటలు ఆడుకునే సమయంలో డ్రిల్ మాస్టర్లు గ్రౌండ్‌లో ఉన్న మొక్కలను తొలగించాలంటే చాలు ఆటలాడే విద్యార్థులందరూ ఉత్సాహంగా ఆ మొక్కలను తొలగించేవారు. నేడు ఆటలాడే విద్యార్థులు కనిపించకపోవడం గమనార్హం. పాఠశాల అధ్యాపకులు సైతం గ్రౌండ్ పరిశుభ్రత పట్ల పెద్దగా ఆశక్తి చూపించడం లేదు. అసలు గ్రౌండ్ వైపే చూసే విద్యార్థులే పెద్దగా కనిపించడంలేదు. దానితో పాఠశాల గ్రౌండ్ అడవిని తలపించేలా మొక్కలు వ్యాపించాయి. పెద్ద పెద్ద విషసర్పాలు సైతం ఆ గ్రౌండ్‌లో తిష్ట వేస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

నీరు పారే అవకాశం ఏదీ?

పాఠశాల గ్రౌండ్ ఇలా అధ్వానంగా తయారుకావడానికి ప్రధాన కారణం వర్షం కురిస్తే గ్రౌండ్‌లో ఉన్న వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడమేనని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. గ్రౌండ్ చెరువులా తయారవడంతో మొక్కలు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. దాంతో గ్రౌండ్‌ను మరమ్మతులు చేయడానికి ఎవరూ ముందుకు వచ్చే వారు కాదు. పట్టణంలో ఎవరైనా దాతలు ముందుకొచ్చి గ్రౌండ్‌ను మరమ్మతులు చేయించినా పది రోజుల్లో మళ్లీ పరిస్థితి మొదటికి వస్తుంది. గతంలో ఈ గ్రౌండ్‌లో నీరు ఏపీజే అబ్దుల్ కలాం పార్క్ (శంభుని చెరువు) ఈ చెరువులోకి వెళ్లేది. దానితో ఈ వందేళ్ల చరిత్రలో గ్రౌండ్‌కు ఎటువంటి ఇబ్బంది కలగలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో స్కూల్ గ్రౌండ్‌ను కొంత ఆక్రమించి పార్క్‌ను ఏర్పాటు చేశారు. కాని ఈ స్కూల్ గ్రౌండ్‌లో వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం మాత్రం నాటి ప్రజాప్రతినిధులు గానీ అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో స్కూల్ గ్రౌండ్‌కు ఈ దుస్థితి ఏర్పడింది.

ముందుకు వచ్చిన పూర్వ విద్యార్థులు

పాఠశాలలోని గ్రౌండ్ సమస్యను పరిష్కరించేందుకు పాఠశాల పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి గ్రౌండ్‌ను మరమ్మతులు చేయిస్తున్నారు. అయినా వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం మాత్రం కనిపించడంలేదు. గ్రౌండ్‌కు తూర్పు వైపున ఓ పైపు లైను ఏర్పాటు చేశారు. అది గ్రౌండ్‌కన్నా ఎత్తులో ఉండడంతో నీరు బయటకు వెళ్లడంలేదు. 1998–99 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 25 వసంతాల రజతోత్సవ వేడుకలు నిర్వహించుకోవడానికి సంసిద్ధులయ్యారు. పాఠశాలకు వచ్చి చూసే సరికి గ్రౌండ్ అత్యంత అధ్వానంగా ఉంది. గ్రౌండ్ మరమ్మతులు చేసి తమ వేడుకలు నిర్వహించుకుందామని ముందుకు వచ్చారు. పాఠశాలకు, మునిసిపల్ అధికారులకు గ్రౌండ్ మరమ్మతులు చేయడానికి అర్జీ పెట్టుకోవడంతో అధికారులు స్పందించి మరమ్మతులు చేయడానికి అనుమతులు ఇచ్చారు. మునిసిపల్ అధికారులు పూర్వ విద్యార్థులకు తోడుగా చెత్తను తొలగించడానికి మునిసిపల్ వాహనాలను ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులు సుమారు రెండు లక్షలు వ్యయంతో గ్రౌండ్ మరమ్మతులు చేశారు. గ్రౌండ్ మరమ్మతు చేసినా వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేదు. అలా అయితే చేసిన పనంతా వృథా అవుతుందని ఆలోచనలో పడ్డారు. అలాగే స్కూల్ నుండి గ్రౌండ్‌లోకి వెళ్లడానికి గేటు ఏర్పాటు, గ్రౌండ్‌లో నిరుపయోగంగా ఉన్న బాస్కెట్‌బాల్ కోర్టుకు మరమ్మతులు, గేటు వద్ద పార్కింగ్ టైల్స్ ఏర్పాటు చేస్తున్నారు.

నీరు వెళ్లే మార్గం లేదు



25 ఏళ్ల రజతోత్సవ వేడుకల్లో భాగంగా పూర్వ విద్యార్థులందరూ జనవరి 12వ తేదీన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకోనున్నాము. పాఠశాలలో జరుపుకుందామంటే మరో పూర్వ విద్యార్థుల సంఘం వేడుకలు నిర్వహించుకుంటున్నారని తెలిపారు. గ్రౌండ్‌లో ఏర్పా టుచేసుకుందామని అనుకుని, గ్రౌండ్ అధ్వానంగా ఉండడంతో మరమ్మతులు చేయడానికి మా బ్యాచ్ ముందుకు వచ్చి గ్రౌండ్ మొత్తం శుభ్రం చేయించాము. కాని గ్రౌండ్‌లో నీరు బయటకు వెళ్లే మార్గం కనిపించడం లేదు.

– పి ప్రసన్నకుమార్, 98–99 పూర్వ విద్యార్థి, పాలకొల్లు

గ్రౌండ్‌ను అభివృద్ధి చేసే అవకాశం దక్కింది



విద్యాభ్యాసం నేర్పిన చదువుల తల్లి ఒడిలో మళ్లీ 25 ఏళ్ల తరువాత మిత్రులందరినీ కలుసుకోబోతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఎవరి నుంచైనా సహాయం పొందితే వారి రుణం తీర్చుకోవాలని అనుకుంటాము. అలా చదువులు నేర్పిన మా విద్యాలయానికి ఏదో చేయాలని అనుకున్నాం. ఇలా పాఠశాల గ్రౌండ్‌ను అభివృద్ధి చేసే అవకాశం దక్కింది. ఈ కలయిక, సేవ ఎంతో ఆనందంగా అనిపిస్తుంది.

– శిరిగినీడి రవికుమార్, పూర్వ విద్యార్థి , పాలకొల్లు

ప్రజాసమస్యలను పరిష్కరించే దిశగా ఉద్యమాలు



జిన్నూరులో కామ్రేడ్ కొప్పర్తి సూర్యనారాయణ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పోడూరు: ప్రజాసమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ఉద్యమాలు నిర్వహించడమే సీపీఎం లక్ష్యమని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పిల్లి ప్రసాద్ అన్నారు. జిన్నూరులో బుధవారం గ్రామ కార్యదర్శి కొప్పర్తి నర్సింహమూర్తి అధ్యక్షతన గ్రామక మిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రసాద్ మాట్లాడుతూ 2025 నూతన సంవత్సరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల అదుపుపై దృష్టిసారించాలన్నారు. సమావేశానికి ముందు సూర్యానగర్ కాలనీ వద్ద కామ్రేడ్ కొప్పర్తి సూర్యనారాయణ విగ్రహానికి పార్టీ సీనియర్ నాయకులు తాళాబత్తుల గాంధీ పూలమాల వేసి కార్యకర్తలతో కలిసి నివాళులర్పించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడంలో కామ్రేడ్ సూర్యనారాయణ ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కిలారి సాంబమూర్తి, చివటపు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.